విశాలాంధ్ర

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

శుక్రవారం 10, జనవరి -2025 4 పేజీలు

జగన్మోహన్ రెడ్డిని కలిసిన మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి

విశాలాంధ్ర-ముత్తుకూరు :ఈనెల 8వ తేదీన విజయవాడలో వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి సహకారంతో మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి కలవడం జరిగింది. నెల్లూరు జిల్లా పార్టీ ముఖ్యులతో, అలాగే ప్రజా ప్రతినిధులతో జగన్మోహన్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించి పార్టీ ఓటమి పాలైన, ఒక్క కార్యకర్తను కూడా వదిలిపెట్టకూడదని, గత ఐదేళ్లు మన వెంట ఉండి నేడు కూడా మనతో ప్రయాణం చేస్తున్న ప్రతి ఒక్కరికి అండగా ఉండాలని సూచించినట్టు తెలిసింది. అలాగే ప్రజా ప్రతినిధులు కార్యకర్తలను కూడా ఎప్పటికప్పుడు కలుపుకొని రాష్ట్ర ప్రభుత్వం చేసే ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై నిత్యం ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల పక్షాన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరునట్టు కూడా తెలిసింది. ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి ప్రతి ఒక్కరికి జిల్లాలో అండగా ఉంటాడని ఎవరికి ఏ కష్టం వచ్చినా తక్షణం ఆయన దృష్టికి తీసుకొని వెళ్లాలని జిల్లాలోని నాయకులందరికి కూడా జగన్ మోహన్ రెడ్డి సూచించినట్టు తెలిసింది.

అన్న క్యాంటీన్ భోజనం, అల్పాహారంలో రుచి, శుచి పాటించాలి : కమిషనర్ సూర్య తేజ

విశాలాంధ్ర- నెల్లూరు టౌన్ : నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లను ప్రతిరోజు సంబంధిత నోడల్ అధికారులు పర్యవేక్షించాలని కమిషనర్ సూర్య తేజ ఆదేశించారు. స్థానిక ఇందిరా భవన్ రోడ్డులోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ గురువారం ఉదయం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో కమీషనర్ స్వయంగా అల్పాహారం స్వీకరించారు. క్యాంటీన్‌లో ప్రజలకు అందుతున్న భోజన నాణ్యత, తాగునీరు, వంటశాల నిర్వహణ, నిర్ణీత సమయంలో టిఫిన్, భోజనం ఏర్పాటును తదితర అంశాలను కమిషనర్ పరిశీలించారు. సంబంధిత నోడల్ అధికారులు ప్రతిరోజు తనిఖీచేసి ఆహార నాణ్యత, మోతాదు తదితర అం శాలను క్రమం తప్పకుండా, క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు అందజేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ 46వ డివిజన్ మండపాలవీధి, కాపు వీధి, గడ్డంవారి వీధి, ట్రంకు రోడ్డు, తదితర ప్రాంతాలలో పర్యటించారు. మరమ్మతులకు గురైన డస్ట్ బిన్ల స్థానంలో వేరే కొత్త వాటిని ఏర్పాటు చేయాలని సూచించారు. నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలాలు పరిశుభ్రంగా ఉండేలా, ప్రజలకు ఉపయోగపడేలా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులంతా విధుల నిర్వహణలో తప్పనిసరిగా యూనిఫామ్, గ్లౌజులు ధరించాలని ఆదేశించారు. భూగర్భ డ్రైనేజీ కనెక్షన్లను ప్రతి గృహానికి అనుసంధానించే చర్యలు వేగవంతం చేయాలని, భూగర్భ డ్రైనేజీ కనెక్షన్ తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. నగరవ్యాప్తంగా రోడ్లపై ఉన్న గుంతలు, ప్యాచ్ వర్క్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. నూతన భవన నిర్మాణాల ప్రాంగణంలో భవనానికి సంబంధించిన నిర్మాణ ప్లాను, అప్రూవల్ అనుమతులను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వార్డు సచివాలయ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి ఆస్తి పన్ను, నీటి కుళాయి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని 100% వసూళ్లు రాబట్టాలని సూచించారు. విద్యుత్ స్తంభం ఉన్న ప్రతి పోల్‌కు విద్యుత్ లైటును ఏర్పాటు చేయాలని, మరమ్మత్తులు గురైన వాటి స్థానంలో నూతన లైట్లు క్రమం తప్పకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంటింటి చెత్త సేకరణలో ఇరుకైన సందులలో చిన్నపాటి పుష్కార్ట్ వాహనాలను వినియోగించి చెత్త సేకరణ క్రమం తప్పకుండా జరపాలని కమిషనర్ ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున 46వ డివిజన్ లోని మూడు సచివాలయాల అడ్మిన్ కార్యదర్శులకు షోకాజు నోటీసులు జారీ చేయమని అధికారులను కమిషనర్ ఆదేశించారు. అదేవిధంగా నూతన నిర్మాణాలను గుర్తించడం, రోడ్డు ఆక్రమణల అంశంపై విధులు సరిగా నిర్వహించనందున ప్లానింగ్ సెక్రటరీకి షోకాజ్ నోటీసు జారీ చేయమన్నారు. విధులలో అలసత్వం ప్రదర్శించిన వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, రెవిన్యూ, ఇంజనీరింగ్, ప్లానింగ్ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

తిరుపతి తొక్కిసలాట బాధితులకు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పరామర్శ

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు: తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందడంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కోవూరు ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మెంబర్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బాధితులకు బాసటగా నిలిచారు. గురువారం ఉదయం హుటాహుటిన తిరుపతికి వెళ్లిన ఆమె.. తిరుపతిలోని పద్మావతి హాస్పిటల్స్, స్విమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వారితో మాట్లాడిధైర్యంగా ఉండాలని సూచించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లతో చర్చించారు. బాధితుల యోగ క్షేమాలపై ఆరా తీశారు. సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమై వైద్య సేవలు అందించాలని, ఎక్కడా ఇబ్బందులు లేకుండాచూడాలనివారికి సూచించారు. బాధితులను ప్రభుత్వంఅన్నివిధాలా ఆదుకుంటుందని, ఎవరూ అధైర్య పడొద్దని స్పష్టం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం 25 లక్షల పరిహారం ప్రకటించిన విషయంపై ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

ఆరుగురు భక్తులుమృతి చెందడం కలచివేసింది:ఎంపి వేమిరెడ్డి

వైకుంఠ ఏకాదశి టోకెన్లు తీసుకునే క్రమంలో జరిగినతొక్కిసలాటలో ఆరుగురు భక్తులుమృతిచెందడంకలచివేసిందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శ్రీవారి దర్శనం కోసం వచ్చి ఇలా జరగడం దురదృష్టకరమన్నారు. భక్తులు మృతి చెందడంపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన అన్నారు. బాధిత కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

అమిత్ షాను బర్త్ రఫ్ చేయాలి :కాంగ్రెస్

విశాలాంధ్రబ్యూరోనెల్లూరు:ఏఐసిసిపిలుపుమేరకు రాజ్యాంగ శిల్పి అయినా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అమిత్ షా చేసిన సిగ్గుమాలిన వ్యాఖ్యలను ఖండిస్తూ నెల్లూరు రూరల్ కొత్తూర్ దగ్గర ఉన్నఅంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు జై బాపూజీ జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవ కుమార్ రెడ్డి సూచన మేరకు అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని బేషరతుగా క్షమాపణలు చెప్పాలని రూరల్ ఇంచార్జ్ మల్లికార్జున్రెడ్డి డిమాండ్ చేశారు. రాజ్యాంగ రూపశిల్పి అణగారిన వర్గాల ఆశాజ్యోతి నిమ్న కులాల జీవితాలలో వెలుగులు నింపిన మహానుభావుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను వక్రీకరించి మాట్లాడడం సిగ్గుచేటు అని మీడియా ఇంచార్జ్, అడ్వకేట్ కే సంజయ్ కుమార్ అన్నారు. 75 సంవత్సరాల రాజ్యాంగ స్ఫూర్తి,విలువలపై చర్చించే బదులు,అంబేద్కర్‌ను అసభ్యంగా వక్రీకరించి మాట్లాడటం బిజెపి నిజస్వరూపాన్ని బయట పెట్టిందన్నారు. వెంటనే బేషరతుగా అమిత్ షా క్షమాపణలు చెప్పాలన్నారు. హెూమ్ మినిస్టర్ గా ఉన్న అమిత్ షాను.బర్త రఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ అధ్యక్షులు అల్లావుద్దీన్, మండల అధ్యక్షులు హుస్సేన్ భాష జనరల్ సెక్రెటరీ ఇర్ఫాన్ సుజాతసేవాదళ్,రెహమాన్,హనీఫ్,ఆదినారాయణ బద్రి,మరియదాస్, సమీర్,సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

విఎస్‌యూలో కొత్త ప్రణాళికలు : వైస్ ఛాన్సలర్ ప్రత్యేక సమావేశం

విశాలాంధ్ర- నెల్లూరు టౌన్ :విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎస్. విజయభాస్కర రావు వివిధ విభాగ అధికారులతో ప్రతేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విశ్వవిద్యాలయ విభాగాల ప్రగతి, పరీక్షల నిర్వహణ, విద్యార్థులకు అందించే సేవల మెరుగుదల,కొత్త ప్రణాళికల అమలు గురించి విస్తృతంగా చర్చించబడింది. ముఖ్యంగా, పరీక్షల సంస్కరణలు, ఫలితాల వేగవంతమైన విడుదల, డిజిటల్ ఇనిషియేటివ్‌లు, పారదర్శకత కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వైస్ ఛాన్సలర్ విశ్వవిద్యాలయం అభివృద్ధికి సంబంధించి ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించి, సిబ్బందికి అవసరమైన మార్గదర్శ కాలను అందించారు. ఆయన ప్రత్యేకంగా, పరీక్షల సంస్కరణలో భాగంగా ఈడిపి సెల్ ఏర్పాటు, ఆన్‌లైన్ ఫీజు చెల్లింపుల పద్ధతులు, ప్రశ్న పత్రాల బ్యాంక్ అభివృద్ధి వంటి ప్రాధాన్యత కలిగిన అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ కె సునీత, విశ్వవిద్యాలయ కళాశాలల ప్రిన్సిపల్స్ ఆచార్య సిహెచ్ విజయ,ఆచార్య టి.వీర రెడ్డి, పరిక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఆర్.మధుమతి, డీన్ సిడిసి డాక్టర్ యం.హుస్సేనయ్య, ఐ క్యు ఏసి డైరెక్టర్ ఆచార్య అందే. ప్రసాద్, ఆచార్య కె.వి.ఎస్.యన్.జవహర్ బాబు, డాక్టర్ ఆర్. ప్రభాకర్, సూపర్నెంట్ జి.రామకృష్ణ,యఫ్ ఓ, చాముండేశ్వరి తదితరులు పాల్గొనారు.

బీసీ,కాపు, ఈబీసీలకుసబ్సిడీ రుణాలకోసం దరఖాస్తు చేస్కోండి

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు: 2024-2025 ఆర్థిక సంవత్సరమునకు గాను బీసీ, కాపు, ఈబీసీ కులములకు చెందిన అర్హత గల లబ్ధిదారులు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ అధికారి నిర్మలాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 1328 యూనిట్లు, ఈబీసీ కార్పొరేషన్ ద్వారా 91, కమ్మ కార్పొరేషన్ ద్వారా 100 యూనిట్లు, రెడ్డి కార్పొరేషన్ ద్వారా 140, ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా 41 యూనిట్లు, క్షత్రియ కార్పొరేషన్ ద్వారా 6 యూనిట్లు, బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా 32 యూనిట్లు, కాపు కార్పొరేషన్ ద్వారా 231 యూనిట్లు మంజూరైనట్లు చెప్పారు. 50శాతం సబ్సిడీతో ఈ రుణాలను మంజూరు చేయనున్నట్లు చెప్పారు. అలాగే జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటుకు కూడా సబ్సిడీ రుణాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఎంఎస్ఎంఈ బ్యాంక్ లింక్డ్ యూనిట్లకు రూ.25 లక్షల లోపు సబ్సిడీతో రుణాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. అర్హత గత జిల్లాలోని బిసి, ఈబీసీ, కాపు కులములకు చెందిన లబ్ధిదారులందరూ తమ రేషన్‌కార్డు, ఆధార్, ఆదాయ, కుల ధ్రువీకరణ, జనన ధ్రువీకరణ పత్రములతో ఎపిఓబిఎంఎంఎస్ పోర్టల్ ఓపెన్ కాగానే నమోదు చేసుకొనుటకు సిద్ధంగా వుండాలని ఆమె తెలిపారు.

బాలికలకు రంగవల్లుల పోటీలు

విశాలాంధ్ర-నెల్లూరు :కొండాయపాళెం లోని నగర పాలక ప్రాథమిక పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం భాస్కర్ రావు ఆధ్వ ర్యంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థినిలకు రంగవల్లుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కె. సునీత 20 వ డివిజన్ కార్పొరేటర్ చేజర్ల మహేష్ బాబు విచ్చేసి 4,5 తరగతుల బాలికలు వేసిన రంగవల్లులను పరిశీలించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటే అందమైన ముగ్గులకు, గొబ్బెమ్మలకు, హరి దాసు పాటలకు, గాలిపటాలు ఎగుర వేయడం మరెన్నో సంబరాలుకు ప్రసిద్ధి చెందినది. పంటల పండుగని ఉంటారని అన్నారు. అనంతరం రంగవల్లుల విజేతలైన శ్రావణి,ఇషిత, ఆయేషా లకు బహుమతులను అందజేశారు. అనంతరం బోగీ మంటలను వేసారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరీష్,కిరణ్, సోమేశ్వర రావు స్థానిక నాయకులుపాల్గొన్నారు.

ఓవెల్ మోడ్రన్ పాఠశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర -నెల్లూరు టౌన్ : నెల్లూరు నగరంలోని 11వ డివిజన్ సరస్వతీ నగర్ లోని ఓవెల్ మోడ్రన్ పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పల్లెటూరి వాతావరణం మరిపించే విధంగా భోగి పండుగకు సంబంధించిన ముగ్గులు, హరిదాసు, గంగిరెద్దులు, భోగిమంటలతో మన సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా పాఠశాల ఆవరణమును అందంగా తయారు చేశారు. నర్సరీ నుండి రెండవ తరగతి విద్యార్థులకు భోగిపళ్ళను పోశారు.మూడో తరగతి నుంచి పదవ తరగతి వరకు బాలికలకు ముగ్గుల పోటీలను, బాలురకు పతంగుల పోటీలను నిర్వహించారు.విద్యార్థులకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల సి.ఎం.డి ఆర్ వేణు, సీ.ఈ.ఓ . ప్రమీల, జి.ఎం. మహాదేవ్,ఈ.డి. బాలు, డి.జి.ఎం .శ్రీనివాసులు, బి.ఎం.ఏ .సుధాకర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రభాకర్, ఏ.జీ.ఎం. సునీల్,హైస్కూల్ ఇన్చార్జి మల్లికార్జున, ప్రైమరీ ఇంచార్జ్ రమాదేవి ,ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ సుప్రజ పాల్గొన్నారు.

జీ తెలుగుసంక్రాంతి సంబరాలు

కల్కి 2898 ఏడీ, సంక్రాంతిసంబరాలు ఫైర్, వైల్డ్ ఫైర్

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు: తెలుగు పండుగలు, ప్రత్యేక సందర్భాలను వినోదభరిత కార్యక్రమాలతో మరింత ప్రత్యేకంగా మార్చే జీ తెలుగు ఈ సంక్రాంతికి మూడు ముచ్చటైన కార్యక్రామాలతో వినోదం పంచేందుకు సిద్ధమైంది. నూతన సంవత్సరాన్ని ప్రత్యేక కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించిన జీ తెలుగు తాజాగా కాకినాడలో విక్టరీ వెంకటేష్ అతిథిగా సంక్రాంతి సంబరాలను 'సంక్రాంతి సంబరాలకి వస్తున్నాం' ఈవెంట్తో వైభవంగా నిర్వహించింది. అభిమానుల కోలాహలంతో ఘనంగా జరిగిన ఈ కార్యక్రమాన్ని ఈ జనవరి 11శనివారం సాయంత్రం 6 గంటలకు, పాన్ ఇండియా బిగ్గెస్ట్ బ్లాక్బస్టర్ కల్కి2898 ఏడీ సినిమాను వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా జనవరి12, ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు, సంక్రాంతి సంబరాలు ఫైర్, వైల్డ్ ఫైర్ ప్రత్యేక కార్యక్రమం జనవరి13, సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రసారంచేయనుంది మీ జీ తెలుగు.కాకినాడ వేదికగా జరిగిన 'సంక్రాంతి సంబరాలకి వస్తున్నాం' కార్యక్రమంలో జీ తెలుగు తారలతో పాటు 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా నుంచి విక్టరీ వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్లు ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి, సీనియర్ నటులు రాజేంద్రప్రసాద్, గౌతమి, శ్రీలక్ష్మి, శివపార్వతి, కమెడియన్ శ్రీనివాస్ రెడ్డి, నిర్మాత శిరీష్ పాల్గొని అభిమానులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. యాంకర్ రవి, అషు రెడ్డి వ్యాఖ్యాతలుగా వ్యవహరించిన అద్భుతమైనప్రదర్శనలు,సరదాసంభాషణలతో సందడిగా సాగింది. ఈ సంక్రాంతి సంబరాల్ని మరింత ప్రత్యేకంగా మార్చేందుకు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన మోస్ట్ అవైటెడ్ గ్లోబల్ బ్లాక్ బస్టర్ కల్కి 2898 ఏడీ సినిమాని అందిస్తోంది జీ తెలుగు. పురాణాలు, సైన్స్ ఫిక్షన్, అదిరిపోయే విజువల్స్ మేళవించిన ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, ప్రభాస్, దీపికా పదుకొణె వంటి నటుల అద్భుత నటన ఈ సినిమాని ప్రపంచ వ్యాప్తంగా సినీ ప్రేక్షకులను మెప్పించి బిగ్గెస్ట్ హిట్గా నిలిపింది. ఈ సినిమా చూసే ప్రేక్షకులకు జీ తెలుగు మరో అద్భుత అవకాశం కల్పిస్తోంది. కాంటెస్ట్ని నిర్వహిస్తోంది జీ తెలుగు. మీరు చేయాల్సిందల్లా కల్కి సినిమా చూస్తూ టీవీ స్క్రీన్పై వచ్చే క్యూఆర్ కోడ్ని స్కాన్ చేయడం లేదా లాగిన్ అయి కల్కి గేమ్ ఆడి అదిరిపోయే బహుమతులు గెలవచ్చు. ఈ కాంటెస్ట్లో గెలిచిన మొదటి అయిదుగురు కల్కి 2 సెట్స్ సందర్శన, 100 మంది కల్కి థీమ్తో అదిరిపోయే బహుమతులు అందుకోవచ్చు.ఇంకెందుకు ఆలస్యం మీరూ ఈ కాంటెస్ట్లో పాల్గొనండి!

జీ తెలుగు సంక్రాంతి సంబరాలకి కొనసాగింపుగా సంక్రాంతి సంబరాలు ఫైర్ , వైల్డ్ ఫైర్ కార్యక్రమం సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రసారం కానుంది. యాంకర్ రవి, వర్షిణి వ్యాఖ్యాతలుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు, జీ తెలుగు తారలు అత్తలు, కోడళ్లు పేరున రెండు టీమ్లుగా ఏర్పడి వినోదం పంచేందుకు పోటీపడ్డారు. బేబీ సినిమా ఫేమ్ వైష్ణవి చైతన్య, యాంకర్ ప్రదీప్ మాచిరాజు, వందేమాతరం శ్రీనివాస్,సీనియర్ హీరోయిన్ రాధ, మన్మథుడు సినిమా ఫేమ్ అన్షు, దర్శకుడు, నటుడు ఎస్.జె.సూర్య హాజరై అందరిలో మరింత ఉత్సాహం నింపారు. వినోదభరితంగా సాగిన ఈ కార్యక్రమాలను జీ తెలుగు వేదికగా మీరూ తప్పకుండా చూడండి!

ఆరోగ్య కేంద్రంలో గర్భవతులకు పరీక్షలు

విశాలాంధ్ర-గుడ్లూరు : స్థానిక గుడ్లులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమం (ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్) గర్భవతుల పరీక్షల కార్యక్రమం జరిగినది.వైద్యాధికారి డాక్టర్ పి . మారుతీరావు 25 మంది గర్భవతులను పరీక్షలు జరిపి మందులు ఇచ్చారు. 5 మందిని హై రిస్క్ గర్భవతులుగా గుర్తించడం జరిగినది.వారిని ప్రతీ నెలా ఆరోగ్య కేంద్రానికి తీసుక వచ్చి పరీక్షలు జరిపించాలని, ప్రతీవారం వారి వారి కుటుంబములను దర్శించి వారికి అందులోబాటులో ఉండి, ఆరోగ్య సలహాలు ఇవ్వడం జరగాలని సిబ్బందికి ఆదేశాలు ఇవ్వడం జరిగినది. ప్రతీ గర్భవతి కి ఐరన్ మాత్రలు, కాల్షియం మాత్రలు వారి వారి ఇంటి దగ్గర అందించాలని, వారిని నిరంతరంపరమార్శించాలని, వారికి టీకాలు వేయించాలి అని సిబ్బందికి ముఖ్య సూచనలు ఇవ్వడం జరిగినది.ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ భాస్కరరావు, వరలక్ష్మి, అరిఫ్ హెచ్ఈఓ, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం లు, ఎంఎల్ హెచ్పిలు పాల్గొన్నారు.

కరుణేషు దేవి కథకు ప్రథమ బహుమతి

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు:మారుతీ మహిళా సొసైటీ వారు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ శాఖ, రెడ్ క్రాస్ సొసైటీ వారు సంయుక్తంగా నిర్వహించిన ఎయిడ్స్ అవగాహన మినీ కథల పోటీలో 174 కథలు రాగా, వివిధ వాడపోతల అనంతరం 35 కథలను కవి, గేయ రచయిత,రసరాజు పరిశీలించి, డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య రచించిన "కరుణేషు దేవి" అనే కథకు ప్రథమ బహుమతి 5 వేలు బహూకరించారు. ఈ కార్యక్రమం గుంటూరు రెడ్ క్రాస్ సొసైటీ ఆఫీసులోజరిగింది. ఈ కార్యక్రమంలో గజల్ శ్రీనివాస్, గేయకవి రసరాజు, మహిళా సొసైటీ అధ్యక్షురాలు లక్కంరాజు సునీత, గుంటూరు జనరల్ హాస్పిటల్ సూపరెండెంట్ డా. యశస్వి రమణ, రెడ్ క్రాస్ రామచంద్ర రాజు, ప్రముఖ నటుడు డా. నాయుడు గోపి, రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ అధికారిణి సరస్వతి పాల్గొన్నారు.

పొలం పిలుస్తుంది కార్యక్రమం

విశాలాంధ్ర-గుడ్లూరు :చేమిడితిపాడు, చేవూరు రైతు సేవా కేంద్రాల పరిది లోని గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి బి. రవికుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది, పొలంబడి కార్యక్రమాలను నిర్వహించారు. వ్యవసాయ శాఖ, అనుబంధ రంగాలు పొలం పిలుస్తోంది, పొలంబడి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలు ముమ్మరం చేశారు. మండల వ్యవసాయ అధికారి బి. రవికుమార్ మాట్లాడుతూ వరి పంటకు గాను పంట భీమా ఈ నెల అనగా 15 వరకు పొడిగించబడినది కావున బ్యాంక్ లలో పంట ఋణము తెసుకోని రైతులు తప్పనిసరిగా పంట భీమా చేయించుకోవలసినదిగా మనవి. ఒక ఎకరాకు 168 రూపాయలు మాత్రమే చెల్లించవలసి ఉంటుంది. దీనికిగాను ఏదేని ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నస్టం సంభవించినప్పుడు రూ.42000 వరకు పరిహారం అందుతుంది కావున తప్పనిసరిగా పంట భీమా చేయించుకోవలసినదిగా మనవి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సహాయ వ్యవసాయ సంచాలకులు కందుకూరు పి.అనసూయ, చిమిడితిపాడు, గ్రామ ఉద్యాన సహాయకులు పి.స్వర్ణ, గ్రామ వ్యవసాయ సహాయకులు పి.రఘు, గ్రామనాయకులు రైతులు పాల్గొన్నారు.

నలదలపూరు పాఠశాలలో ముందుస్తు సంక్రాతి సంబరాలు

విశాలాంధ్ర- వలేటివారి పాలెం :మండలంలోని నలదలపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బీరకాయల మాధవరావు ఆధ్వ ర్యంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, సిబ్బంది కలిసి సంక్రాంతి సంబ రాలను గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థినులు రంగవల్లులను తీర్చిదిద్దారు. విద్యార్థులు ఉపాధ్యాయులు ప్రధానోపా ధ్యాయులు అందరూ కలిసి భోగిమంటలు వేసి తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బీరకాయలు మాధవరావు మాట్లాడుతూ తెలుగువారి పెద్ద పండుగ అయిన సంక్రాంతిని అందరూ ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఈ నూతన సంవత్సరంలో అందరి జీవితాల్లో పండుగ వెలుగులు రావాలని 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులు రాబోయే మార్చి 2025 పబ్లిక్ పరీక్షల్లో అద్భుతంగా రాణించాలని మనసా వాచా కర్మణా కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్డులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యవారిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-వలేటివారిపాలెం: మండలంలోని అయ్యవారిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మూడు రోజులకి ముందుగానే సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని తల్లిదండ్రులందరి ఆధ్వర్యంలో భోగి మంటలు అలాగే సంక్రాంతి ముగ్గులు వేసి అందరినీ ఆనందపరిచారు. ఈ సంవత్సరం సంక్రాంతి పండుగ ప్రజలందరూ ఆనందంగా జరుపుకోవాలని, పిల్లలు ఆటలు పాటలతోటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిసిన వారికి బహుమతులు ప్రధానం చేసారు. అలాగే భోగిమంటలు వేసి సంక్రాంతి సంబరాలు ముందుగానే నిర్వహించినందుకు గ్రామంలోని ప్రజలంతా సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు, హనుమం తరావు, శివకుమారి, రజిత, ప్రసన్న, ప్రియ, పాఠశాల చైర్మన్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సింహపురి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందుస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు పంచాయతీలోని మద్దులమడుగు సెంటర్ సమీపంలోని సింహపురి ఇంగ్లీషు మీడియం పాఠశాల ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రాచీన తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా పాఠశాలను రంగురంగుల తోరణాలతో అలంకరించి పురాతన తెలుగు సంప్రదా యాలను, సంక్రాంతి పండుగ ప్రత్యేకతను విద్యార్థిని, విద్యార్థులకు తెలియ జేశారు. అంగరంగ వైభవంగా సంక్రాంతి ముందస్తు వేడుకులను జరపడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

శ్రీ సంస్కృతి స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : పట్టణంలోని గుర్రంవారి వీధిలోని శ్రీసంస్కృతి పాఠశాలలో సంక్రాంతి పండుగ సంబరాలు అంబరాన్ని అంటేల ఘనంగా నిర్వహించారు. తెలుగు సంస్కృతిని ప్రతిబింబిస్తూ సంప్రదాయ దుస్తుల్లో చక్కగా అలంకరించుకుని పాఠశాల కార్యక్రమంలో పాల్గొని సాంప్రదాయ బద్ధంగా పొంగలి వండి నైవేద్యం సమర్పించి కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అచ్చ తెలుగు పల్లెటూరి వాతావరణాన్ని తలపించేలా గుడిసెలు నిర్మించి బొమ్మలకొలువులతో , చిత్రవర్ణ శోభిత రంగవల్లులు, హరిదాసుల ఆలాపనలు, డూ..డూ బసవన్నలు, సన్నాయి రాగాలు, కోడిపందాలు, కోలాటం భోగిమంటలు, గొబ్బెమ్మలు, గాలిపటాల గగన విహారాలు తెలుగు పిండివంటకాల షడ్రుచులతో పల్లె పడుచు దనాలతో, చిన్నపిల్లలకు భోగి పళ్ళు పోయటం వంటి కార్యక్రమాలతో,విద్యార్థులు అలరించి కనువిందు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కొంకా చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలుగు వారి పండుగల్లో అతి ప్రధానమైనది సంక్రాంతి పండుగని రైతన్నలు సుఖసంతోషాలతో తమ పంటను ఇంటికి తెచ్చుకుని వేడుకగా జరుపుకునే పండుగ సంక్రాంతి అని, సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే సమయం కాబట్టి మకర సంక్రాంతి అని పిలుస్తారనిన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.శివ కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ శోభారాణి ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నాగార్జున పబ్లిక్ స్కూల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : కందుకూరు పట్టణంలోని నాగార్జున పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు సిబ్బంది కలిసి సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు రంగవల్లులను తీర్చిదిద్దారు. విద్యార్థులు గాలిపటాలను ఎగరవేసి సంక్రాంతికి స్వాగతం పలికారు. విద్యార్థులు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కరస్పాండెంట్ అందరూ కలిసి భోగిమంటలు వేసి తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. సంప్రదాయ సంక్రాంతి వేషాలు హరిదాసులు, గోపికలు వేషధారణతో అలరించారు. చిన్నారులకు భోగి పళ్ళను వేసి ఆశీర్వాదాలను అందించిన కరస్పాండెంట్ దీవెనలను అందించారు . ఈ సందర్భంగా కరస్పాండెంట్ షాలిని రెడ్డి మాట్లాడుతూ తెలుగువారి పెద్ద పండుగ అయిన సంక్రాంతిని అందరూ ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఈ నూతన సంవత్సరంలో అందరి జీవితాల్లో భోగి వెలుగులు,సంక్రాంతి సంతోషాలు,కనుమ పండుగల భోగభాగ్యాలు కలగాలని కోరుకున్నారు. విద్యార్థులు చదువుల్లో విశేషంగా రాణించాలని తల్లిదండ్రులతో పాటు విద్య నేర్పిన స్కూలుకు కూడా మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మ(ర)రెడ్డి, బాల బ్రహ్మం, శ్రీనివాసులు, విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు అందరూ పాల్గొన్నారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

నెల్లూరు మహిళా ప్రాంగణంలో కిషోరి వికాసం

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు: నెల్లూరు మహిళా ప్రాంగణంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, నెల్లూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కిషోరి వికాసం మండల్ లెవెల్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఉమెన్ కమిషన్ మెంబెర్ షేక్ .రుకయాబేగం జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత,ఐసిడిఎస్ సీడీపీఓకే లక్ష్మిదేవి ఎంఈఓ లు మురలీదర్, తిరుపాల్ జిల్లా బాలల సంరక్షణ అధికారి బి.సురేష్ యుపీ హెచ్సి డాక్టర్.రిటలీల, డాక్టర్ దీప్తి,లలిత పాల్గొన్నారు. ఈ ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో స్కూల్ టీచర్లు,ఏమ్స్, అంగన్వాడి కార్య కర్తలులు పాల్గొన్నారు. శిక్షణ తీసుకున్న వారు గ్రామాలలో10 నుండి 15 మంది కిషోరి బాలికలతో స్నేహిత గ్రూప్స్ ఏర్పాటు చేయాలనీ తెలియజేసారు ఈ కార్యక్రమానికి శిక్షకులుగా డీపీహెన్మంజుల, డీసీపీఓ బి సురేష్ ఎంఈఓ మురలీధర్ వ్యవహరించారు. ఏపీ ఉమెన్ కమిషన్ మెంబెర్ షేక్ రుకాయ బేగం మాట్లాడుతూ యుక్తవయస్సులో ఉన్న బాలికల, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాస కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందనిన్నారు. శిక్షణ పొందిన వారు గ్రామాల్లో యువతకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ అనే అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అలాగే గ్రామ స్థాయిలో కిషోర్ బాలికలను10 నుంచి15 మందిని గ్రూప్‌లుగా ఏర్పాటు చేయటం జరుగుతుంని తెలియచేశారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర- ముతుకూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ నుండి 19వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో శుక్రవారం నుండి స్కూలు మూసి వేయడం జరుగుతుందని అందువల్లే పాఠశాల వర్కింగ్ డే చివరి రోజున విద్యార్థినిలకు ముగ్గుల పోటీ నిర్వహించి బహుమతులు అందజేశామన్నారు. అలాగే సంక్రాంతి భోగిమంటలతోనే ప్రారంభం అవుతుంది కనుక పాఠశాలలో భోగిమంటలకు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. అలాగే సంక్రాంతి యొక్క వైభవాన్ని కూడా విద్యార్థులకు తెలిపారు. అలాగే పండుగలను చేసుకుంటూ విద్యార్థులు తమ చదువులను అశ్రద్ధ చేయవద్దని తెలిపారు.

మంత్రి మెప్పు కోసం తిరుమల నాయుడు విమర్శలు

వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు మజ్జిగ జయ కృష్ణారెడ్డి

విశాలాంధ్ర- నెల్లూరు టౌన్ : మంత్రి నారాయణ మెప్పు కోసం తిరుమల నాయుడు వైసీపీ నగర ఇన్ చార్జి చంద్ర శేఖర్ రెడ్డి పై విమర్శలు చేస్తున్నారని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మజ్జిగ జయ కృష్ణ రెడ్డి విమర్శించారు. నెల్లూరు చిల్డ్రన్స్ పార్క్ రోడ్ లోని రాంజీ నగర్ వైసిపి నగర నియోజకవర్గ కార్యాలయంలో వైఎస్ ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షులు మజ్జిగ జయ కృష్ణారెడ్డి మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. టిడిపి నేత తిరుమల నాయుడు రాజకీయ పబ్బం గడుపుకునేందుకు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ని అమర్యాదగా, స్థాయికి మించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. చంద్రశేఖర్ రెడ్డి వద్ద విద్యార్థిగా, విద్యార్థి విభాగం నేతగా మెలిగిన తిరుమల నాయుడుకి చంద్రశేఖర్ రెడ్డి మనస్తత్వం గురించి తెలియదా అని ప్రశ్నించారు. పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కరోనా లాంటి కష్ట సమయంలో.. ప్రజలకు అందుబాటులో ఉండి రెడ్ క్రాస్ ద్వారా ఎన్నో సేవలందించారని తెలిపారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకొని తిరుమల నాయుడు మాట్లాడితే బాగుంటుందని హెచ్చరించారు.

ఆర్ఎస్ఆర్‌లోఘనంగాముందస్తు సంక్రాంతిసంబరాలు

విశాలాంధ్ర- బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలలో గల రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఈసీఈ డిపార్ట్మెంట్, ఎన్ ఎస్ ఎస్ సంయుక్తంగా ముందస్తు సంక్రాంతి సంబరాలను కోలాహలంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పివిఎన్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగావారు మాట్లాడుతూకార్యక్రమంలో హిందూసాం ప్రదాయ, తెలుగు రాష్ట్రాలసంప్రదాయాలు ఉట్టిపడేలానిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొదటగాభోగిమంటలతో ప్రారంభించి భోగిమంట చుట్టూ కోలాటాలకోలాహలంతో సందడి చేశారు. అనంతరం రంగవల్లుల పోటీలు కళాశాల మొత్తాన్ని ఆనందోత్సాహాల నడుమ, ఉత్సాహంతో ఉల్లాసంగానిర్వహించారు. రంగవల్లులలోమొదటి బహుమతిగా పీ. స్మైల్ ఈసీఈ సెకండ్ ఇయర్, ద్వితీయ బహుమతి టీ. మేఘన థర్డ్ ఏఐ డిఎస్ మరియు తృతీయ బహుమతిని పి. భాను సెకండ్ ఏఐ డిఎస్ విద్యార్థినులు గెలుపొందగావారికి ప్రిన్సిపల్ మరియుఅధ్యాపకులుచేతుల మీదుగాబహుమతులు అందజేశారు. అనంతరం కన్సిలేషన్ బహుమతులను కూడా ఐదుగురికి అందజేశారు. పై కార్యక్రమంలో ఈసీఈ డిపార్ట్మెంట్ హెచ్ ఓ డి వి సునీల్ రెడ్డి, ఏవో ఆర్ వి రమణారెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఏ కిరణ్ కుమార్ అన్ని విభాగాలు అధిపతులు అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు...

విశాలాంధ్ర- కావలి రూరల్: గొబ్బెమ్మలతో అలంకరించిన రంగ వల్లులు.. బసవన్నల నాట్యాలు.. హరిదాసుల సంకీర్తనలు.. పాల కుండలు.. చెరుకు గడలతో అలంకరించిన అందాలు.. పరికిణి ఓణీలలో దర్శన మిచ్చిన చిన్నారులు.. నోరూరించే పిండి వంటలు.. చిన్నారుల నర్తించిన ఆటపాటలు.. తెలుగు ఆచార సాంప్రదాయలను ఉట్టిపడేలా కావలి వెంగళరావు నగర్‌లో ఉన్న క్రాంతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం జరిగిన ముందస్తు సంక్రాంతి సంబరాలు ఆహుతులను కనువిందు చేసాయి. పాఠశాలకరస్పాండెంట్ మాజీ మున్సిపల్ చైర్మన్ నగల్ల శ్రీనివాస్ కిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు తెలుగు సాంప్రదాయాలను ఇనుమిడింపజేసేలా రంగవల్లులను వేసి , గాలి పటాలను ఎగురవేశారు. అలానే భోగి కుండను పెట్టి చెరుకుగడులతో అలంకరించారు. పాఠశాలలో చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మాజీ మున్సిపల్ చైర్మన్, నగల్ల శ్రీనివాస్ కిరణ్ మాట్లాడుతూ తెలుగు వారి పండగ సంక్రాంతి పండగని, ఈ పండుగ తెలుగు ఆచార సాంప్రదాయాలకు ప్రతీక అని తెలిపారు. పిండి వంటలు,బోగి మంటలు, గొబ్బెమ్మలు, హరిదాసు కీర్తనలు,బసవన్నల నృత్యాలు, చిన్నారుల ఆటపాటలు మన ఆచార సాంప్రదాయాలు మరగున పడకుండా రేపటి తరాలకు తెలియజేసాలా సంక్రాంతి సంబరాలను ఘనంగా ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ,విద్యార్థులు ,వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓవెల్ ఐ.సి.ఓ. పాఠశాలలో కోలాహలంగా సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర- నెల్లూరు సిటీ : నెల్లూరు నగరంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద గల ఓవెల్ ఐ.సి.ఒ. పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు కోలాహలంగా జరిగాయి. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణంలోని క్రీడా మైదానంలో తోరణాలు, చెఱకు గడలతో పల్లె వాతావరణం తీసుకొచ్చారు. కాలుష్యం లేని భోగి మంటలతో వేడుకలకు నాంది పలికారు. పొంగళ్ళు తయారు చేసి సూర్యభగవానుడికి నైవేద్యం పెట్టారు. మరికొందరు విద్యార్థులు ఆకర్షణీయమైన ముగ్గులతో ఆహ్వానం పలికారు. సంక్రాంతి పాటలతో ఆడిపాడారు. నోరూరించే తెలుగు వంటకాలను రుచి చూపించారు. వేదికపై సంక్రాంతి లక్ష్మిని అలంకరించి ఆరాధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమణయ్య నాయుడు మాట్లాడుతూ ఈ ఏడాది సంక్రాంతి వేడుకలు చేసుకోవడం అమ్మవారి అనుగ్రహం అన్నారు. పండుగలు మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలని వివరించారు. పాఠశాలల డైరెక్టర్ వేణు మాట్లాడుతూ పండుగలు సాంస్కృతిక వైవిధ్యం గురించి ఎంతో నేర్పుతాయన్నారు. కుటుంబసభ్యులతో బలమైన బంధాలు ఏర్పడతాయన్నారు. కలతలను దూరం చేసే అనుబంధాల వేడుక అని తెలియజేసారు. కార్యక్రమంలో సిఇవో.ప్రమీల , జిఎం . మహదేవయ్య, ఇధి బాలు, ఎజిఎం. కిశోర్ , ఎక్జిక్యూటీవ్ ఇన్చార్జ్ రహమతున్నీసా, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బందితో సహా వివిధ విభాగాధిపతులు పాల్గొని విజయవంతంగా నిర్వహించారు.

దళితుల భూ కబ్జాదారుడికి కొమ్ముకాస్తున్న విఆర్ఓను సస్పెండ్ చేయాలి-అఖిల భారత రైతు కూలీ సంఘం

విశాలాంధ్ర-రాపూరు: సైదాపురం మండలంలోని జోగిపల్లి గ్రామంలో పేదల దళితులకు ఇచ్చిన అసైన్మెంట్ భూములను కాచెయ్యాలని కుట్రతో కక్ష కట్టి వారిపై దాడి చేసి కులం పేరుతో దూషించిన గ్రామ తెలుగుదేశం నాయకులపై కఠిన చర్యలు చేపట్టి వారికి సహకరించిన గ్రామ విఆర్ఓ సూర్యంను విధుల నుండి తొలగించాలని జిల్లా రైతు కూలి సంఘం అధ్యక్షులు డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. సైదాపురంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో నిరసన చేపట్టి అనంతరం తహసీల్దార్ ఈగా రమాదేవి లిఖిత పూర్వకంగా వినతిపత్రం అందచేశారు. సైదాపురంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో దళితులతో కలసి నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం గ్రామ రెవిన్యూ అధికారి సూర్యను వెంటనే విధుల నుండి తొలగించాలని నినాదాలు చేసారు. ఈ సందర్భంగా పోలయ్య మాట్లాడుతూ సైదాపురం మండలంలోని జోగిపల్లి గ్రామంలో దళితులకు సాగు చేసుకుంటున్న అసైన్మెంట్ భూములపై కన్నేసిన కుట్ర దారుడు గ్రామ తెలుగుదేశం నాయకుడు మేకల కృష్ణం నాయుడు అధికార బలంతో దళితులను భయభ్రాంతులకు గురిచేసి ప్రభుత్వ రికార్డ్‌లను తారుమారు చేసి వారి భూములను కాజేయ్యాలనే కుట్రతో ఈ దాడులకు పాల్పడుతున్నాడన్నారు. గ్రామ రెవిన్యూ అధికారి సూర్యపై ఎన్నో ఆరోపణలు ఉన్న నేపథ్యంలో దళితుల భూములను కాపాడుకోవలసిన అవసరం జిల్లా,మండల అధికారులపై ఉందన్నారు. గ్రామ రెవిన్యూ అధికారి సూర్యను, ఇతర అధికారుల పై తక్షణం జిల్లా ఉన్నత అధికారులు స్పందించి క్రిమినల్ కేసులు నమోదు చేసి, విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. దళితుల హక్కులను జిల్లా జాయింట్ కలెక్టర్‌కూ నివేదిక అందచేయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోగిపల్లి గ్రామ దళితులు, ఐయఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రమేష్,జిల్లా రైతుకూలి సంఘం కార్యదర్శి అంకయ్య, నాయకులు వెంకటయ్య, మమత, రమణమ్మ,యశోదమ్మ,శారదా పాల్గొన్నారు.

ప్రతిభకు గుర్తింపు : సిఎం చంద్రబాబుకు క్రీడా కారిణి భవానీ కృతజ్ఞతలు

విశాలాంధ్ర -నెల్లూరు టౌన్ : ప్రతిభను గుర్తించి తనకు నగదు పురస్కారం అందించిందారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు అని పారా అథ్లెటిక్ అంతర్జాతీయ క్రీడాకారిణి భవాని అన్నారు. గురువారం నెల్లూరు నగరంలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో జిల్లా క్రీడల అధికారి యతిరాజ్‌తో కలిసి ఆమె పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారిణి భవాని మాట్లాడుతూ థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ పారా అథ్లెటిక్ పోటీల్లో భారత జట్టు తరపున పాల్గొని 100 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్‌లో తాను రజత పతకం సాధించినట్లు చెప్పారు. తన ప్రతిభను గుర్తించి శాప్ చైర్మన్ రవినాయుడు ఎన్ఆర్ఐ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి తనకు రూ.లక్ష నగదు పురస్కారాన్ని అందించారని చెప్పారు. తన ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, శాప్ చైర్మన్ రవినాయుడు, జిల్లా క్రీడల అధికారి యతిరాజ్‌కు ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. 2019 నుంచి తాను పారా అథ్లెటిక్ క్రీడలను కోచ్ జనీమ్ పర్యవేక్షణలో ప్రాక్టీస్ చేస్తున్నట్లు చెప్పారు. తాను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించేందుకు తనను అన్నివిధాల ప్రోత్సహించిన కోచ్ జనీమ్ సహకారం మరువలేనిదన్నారు.

జిల్లా క్రీడల అధికారి యతిరాజ్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లా తరపున పాల్గొని అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్‌లో రజత పతకం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చిన క్రీడాకారిణి భవానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆమె కఠోర శ్రమ, నిరంతర సాధనతోనే ఈ విజయం దక్కిందన్నారు. ఏసీ సుబ్బారెడ్డి మైదానంలో ఆమె క్రీడల్లో శిక్షణ పొందినట్లు చెప్పారు. దివ్యాంగులు ఎందులోనూ తక్కువ కాదని, అందుకు నిదర్శనం భవాని అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రత్యేక క్రీడా పాలసీతో క్రీడాకారులకు గుర్తింపు లభిస్తోందన్నారు.

పారా క్రీడల కమిటీ జిల్లా అధ్యక్షులు టిని మాల్యాద్రినాయుడు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత సరికొత్త క్రీడా పాలసీని ప్రకటించిందన్నారు. రాష్ట్రంలోని అన్ని క్రీడా మైదానాలను అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. విశాఖలో 2వేల కోట్లతో అతిపెద్ద క్రీడా ప్రాంగాణాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. క్రీడాకారులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ శాతాన్ని కూడా పెంచినట్లు చెప్పారు. దివ్యాంగుల క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ వారిని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కోచ్ జనీమ్ మాట్లాడుతూ అత్యంత ప్రతిభ గల దివ్యాంగురాలు, పారా అథ్లెటిక్ ఇంటర్నేషనల్ క్రీడాకారిణి భవానికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పారా అసోసియేషన్ నిర్వాహకులు కటారి యాదగిరి, గురుప్రసాద్, సూపరింటెండెంట్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువతలో స్ఫూర్తి నింపే వివేకానంద ప్రసంగాలు

విశాలాంధ్ర- నెల్లూరు సిటీ : జిల్లా యువజన సంక్షేమ శాఖ - సెట్నెల్ ఆధ్వర్యంలో శ్రీ స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజనోత్సవమును నెల్లూరు డి.కె. డబ్ల్యూ డిగ్రీ కళాశాలలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విక్రమ సింహపురి యునివర్సిటీ వైస్ ఛాన్సలర్ యస్ విజయభాస్కర్ రావు మహ్మద్ గయాస్ అహ్మద్ , మేనేజర్ బి.శ్రీనివాసరావు, సెట్నెల్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా విసి విజయభాస్కర్ రావు మాట్లాడుతూ దేశ నిర్మాణానికి మూల స్తంభంలాంటి యువతరంలో స్ఫూర్తి నింపడానికి శ్రీ స్వామి వివేకానంద అనేక ఉత్తేజకర ప్రసంగాలు చేశారని అన్నారు . అందులో "స్వయంకృషి పట్టుదల ధృడసంకల్పం ఈ మూడు మనల్ని ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దుతుంది అనే ప్రసంగాన్ని యువతకు తెలియజేస్తూ యువత దానిని స్ఫూర్తిగా తీసుకోవాలని తెలియజేశారు. సెట్నెల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ యువత అందరూ శ్రీ స్వామివివేకానందుని బాటలో నడవాలని యువతను ఉద్దేశించి పట్టుదల వదలకుండా చేసే ప్రయత్నం చివరకు విజయాన్ని చేకూరుస్తుందని ఒక్క రోజులో ఏమి సాధించలేమని తెలియజేశారు. ఆర్ ఐవో శ్రీనివాసులు, మాట్లాడుతూ యువత అందరూ మందిలో ఒక్కరిగా వుండకండి వందలో ఒక్కరిగా ఉండటానికి ప్రయత్నించాలని తెలియజేశారు. డా.పోకల రవి, చెస్ట్ ఫిజిషియన్ మట్లాడుతూ సత్యం సమాజానికి తలవంచదు సమాజమే సత్యానికి తలవంచుతుందని అదేవిధంగా ఇప్పుడు ప్రచారంలో వున్న వైరస్లలు ఏవి ఏమిచేయవని వాటిపై అపోహలు అవసరం లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ ఆఫీసర్ ఎ. మహేంద్ర రెడ్డి, కళాశాల , కల్చరల్ కన్వీనర్, కె. ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు తగదు

విశాలాంధ్ర -మనుబోలు: అంబేద్కర్ పై హోం మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలు తగవని కాంగ్రెస్ పార్టీ ఖండించింది. మండల కేంద్రమైన మనుబోలు అంబేద్కర్ నగర్లో సర్వేపల్లి ఇంచార్జ్ బళ్ళా హరి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందజేశారు. మోడీ కేడి అమీషా డౌన్ డౌన్ కాంగ్రెస్ పార్టీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం తిరుపతి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బాల గురువం బాబు మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్లో అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ ముక్తకంఠంతో ఖండిస్తోందని అన్నారు. బళ్ళ హరి మాట్లాడుతూ హోం మంత్రి ని వెంటనే క్షమాపణ చెప్పకపోతే బంద్, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. రాజ్యాంగ నిర్మాతపై ఎందుకు అనుచిత వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందో తెలపాలన్నారు. వెంటనే క్షమాపణ చెప్పకపోతే దేశవ్యాప్తంగా చారిత్రక నిరసనలు చేపడతామని అన్నారు. అనంతరం మానవహారం నిర్వహించారు. గ్రామం దద్దరిల్లి విధంగా నినాదాలు చేశారు. అలాగే తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ ఏడుగురు సమన్వయకర్తలు అలాగే సర్వేపల్లి నియోజకవర్గ మండల నాయకులు పొలెపు కృపానందం ,బండి ప్రేమ్ కుమార్, కొప్పుల సురేంద్ర, జి రఘుబాబు చేతి సుధాకరయ్య కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

కిశోర వికాసంతోనే బాలికల సంరక్షణ

విశాలాంధ్ర-ముత్తుకూరు : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యునె సహకారంతో చేపట్టిన కిశోర్ వికాసం తోనే బాలికల సంరక్షణ జరిగే అవకాశం ఉంటుందని ఎంపీడీవో నాగమణి, ఐసిడిఎస్ ఇందుకూరుపేట ప్రాజెక్టు సిడిపిఓ రాజ్యలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారులు మధుసూదన, హేమ సుందర్, డాక్టర్ దేవి కృపలు తెలిపారు. గురువారం మండలంలోని వెలుగు కార్యాలయంలో మండల పరిధిలోని గ్రామీణ స్థాయిలో 11 నుండి 18 ఏళ్ల లోపు బాలికలకు వారికి ఆ వయసులో ఎదురయ్యే సమస్యలు, ఆరోగ్యపరంగా వారిలో వచ్చే సమస్యలు, శరీరంలో వచ్చే మార్పులు, సమాజంలో ఆ వయసు పిల్లలు ఎలా వ్యవహరించాలి, వారికి వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు, పరిసరాల పరిశుభ్రత ఎలా ఉండాలి అనే అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు మహిళా సంరక్షకులకు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు, ఏఎన్ఎం లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిఎం మంజులమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు అమ్మనమ్మ, సుబ్బమ్మ, మంజుల, ముసునూరు వారి పాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేద్దాం

విశాలాంధ్ర-వలేటివారిపాలెం : బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేయడానికి ఇది సమయమని తహసీల్దార్ అబ్దుల్ అమీద్, ఎంపిడిఓ నరేంద్ర దేవ్, ఎస్ఐ మరిది నాయుడు, ఎంఈఓ మల్లికార్జున, సీడీపీఓ శర్మిష్ఠ,చుండి ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ శ్రీవెంకటేశ్వర్, డాక్టర్ మణిదీపిక పేర్కొన్నారు.మండలంలోని చుండి గ్రామంలోని చుండి ఆదర్శపాఠశాల గురువారం సిడీపీఓ శర్మిష్ఠ అధ్యక్షతన కిషోరి వికాసం కార్యక్రమంపై శిక్షణకార్యక్రమం నిర్వహించారు.అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం లు, సచివాలయ వెల్ఫేర్ లు, మహిళా పోలీసులు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లు, ఉపాధ్యాయులు ఆరోగ్యం, ఆహారం, విద్య, బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ లైన్ నెంబర్ ల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ సునీత, సీ హెచ్ ఓ శివరామయ్య, హెల్త్ సూపర్వైజర్ పద్మావతి, నవమణి, మోడల్ స్కూల్ టీచర్ హిమబిందు, యోగ టీచర్స్ శ్రీలత, అనూష తదితరులు పాల్గొన్నారు.

అదాని కృష్ణపట్నం పోర్టులో కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు: అదానీ కృష్ణపట్నం పోర్టు లాజిస్టిక్స్ వర్క్ షాప్, వేర్‌హౌస్ ఆఫీస్, ఎస్ఎస్ 2 బిల్డింగ్‌లో 3 రోజుల పాటు జరిగిన కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆదానీ కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీష్ పటేల్ మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు పోర్టుకు సంబంధించిన నిబద్ధతను జగదీష్ పటేల్ పునరుద్ఘాటించారు. కంటి ఆరోగ్య సమస్యలను ముందస్తుగా రోగ నిర్ధారణ చేయడంలో చికిత్స చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న వైద్య %d% కంటి శిబిరాలతో కార్మికుల శ్రేయస్సును కాపాడేందుకు కొనసాగుతున్న ప్రయత్నాల ప్రాముఖ్యతను చెప్పారు.మోడరన్ ఐ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ నెల్లూరు అదానీ ఆక్యుపేషనల్ హెల్త్ సెంటర్ సహకారంతో నిర్వహించిన శిబిరంలో 422 మంది ఉద్యోగులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

విద్యుత్ అధికారుల ఆకస్మిక దాడులు

విశాలాంధ్ర - ఉలవపాడు : మండల కేంద్రంలోని ఉలవపాడు లోని విద్యుత్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు ఈ దాడుల్లో 150 మంది అధిక లోడు వాడుతున్నట్లు గుర్తించి వారికి నోటీసులు ఇవ్వడం జరిగింది. విద్యుత్ చౌర్యం చేస్తున్న17 మందిని గుర్తించి మాల్ ప్రాక్టీస్‌లో ఉన్న మూడు సర్వీసులపై కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు ఈ సందర్భంగా ఎనిమిది లక్షల రూపాయలు ఫైనల్లు విధించినట్లు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి హైమావతి, యుగంధర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పువ్వాడ శ్రీనివాసరావు అసిస్టెంట్ ఇంజనీరు ఉలవపాడు మరియు కందుకూరు డివిజన్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కందుకూరు టౌన్, రూరల్, ఏఈలు వారి సిబ్బంది పాల్గొన్నారు